# కథకాదు

గుడివాడ సుశీల

పోతపోసిన బంగారుబొమ్మలా ఉండేది సీతమ్మ. అందానికితగ్గ వినయం వందనం ఉండేవి.

అయితేనేం ఆపిల్ల అత్తగారికంటికీ ఆడబడుచుకంటికీ, ఆఖరుకు చేసుకున్న భర్తకీకూడా కంటకప్రాయం అయిపోయింది.

సీతావాళ్లూ మా ఎదురింట్లో కాపరం ఉండేవారు. అప్పటికి సీత కాపరానికి వచ్చిఏదోకొన్ని నెలలుఅయివుంటుంది. మా ఎదురింట్లోదిగి 15 రోజులయింది. రోజూవాళ్ళింటో ఏదో కజ్జా, గందరగోళం సాగుతున్నట్టే ఉండేది. ఒకరోజున సీత కుళాయిదగ్గరికి వచ్చింది నీళ్లకోసం.

ఏమిటమ్మా అలావున్నావు వంట్లో ఏమన్నా నలతగాఉందా అన్నాను. అబ్బే ఏంకాదండీ అనేసి తలవంచుకుని వెళిపోయింది. వంటో నలతకాదమ్మా యింటో కలతలే నీకుతెలీదూఅంది నాపక్కనేఉన్న సుబ్బలక్ష్మమ్మగారు.

సీతని భర్త సరిగ్గా చూడడట. మనిషి అందగాడు కాడు, నలుపు. స్ఫోటకంపడ్డ మూలాన మొహం కొంచెం భీకరంగాకూడా ఉంటుంది. దానికితగ్గట్టు ఎప్పుడు చిర్రుబుస్సు మంటూఉంటాడనీ, దగ్గరికి రానియ్యడనీ కూడా చెప్పింది ఆవిడ. దానికికారణం సీతేనని అత్తగారూ ఇంటిఆడపడుచూ ఆడిపోస్తున్నారట రాత్రింబవళ్ళు.

తరవాత నాలుగైదురోజులు అలాగే సీతనిచూసి పలకరిస్తూవచ్చాను.

ఏమమ్మా ఎప్పుడూ అలా విచారంగా ఉంటావు. చిన్నపిల్లవిగదా నీకేదిగులు తగదుసుమా అమ్మడూఅని ఒకరోజున లాలిస్తూన్నట్టు మందలించాను.

సీత కంట తడిపెట్టుకుంది. ఈ విచారం నాతోటేపోవాలి లెండి పిన్నిగారూ ఈజన్మకింతే అంది మెల్లిగా.

పేగుసంబంధం ఏం లేకపోయినా నాకు మనస్సు చివుక్కుమంది పదహారేళ్లు దాటని పసిపిల్లనోట అలాటి మాట వినేసరికి. ఇంకోళ్ల ఇంటి గొడవలో కలగచేసుకోవడం తప్పే అయినా మనసు ఉండబట్టింది గాదు. అప్పుడే దీపాలు పెడుతున్నారు. సీత వాళ్ల అత్తగారువాళ్లూ గుడికి వెళ్లారు.

ఏమైనా సరేనని సీత వెంట వాళ్లింటికి వెళ్లాను నసూఫు తీసుకుని.

అమ్మడూ నాకు చెప్పకపోతే ఒట్టే సుమీ అన్నాను.

సీతకి ఒక్కసారి ఏడుపు వెల్లుబికి వచ్చేసింది. మా నూరేళ్ల బతుకుని మావాళ్లు మట్టిలో కలిపేశారు అని ఏడిచింది. సీతమాటలు నాకింకా జ్ఞాపకం ఉన్నాయి....

* * *

“మాది మేనరికం. ఆయన మా అమ్మకి స్వయానా తమ్ముడికొడుకు. పెళ్లి చిన్నపుడే చేశారు. మా నాన్నకి ఇష్టం లేదుట. అమ్మపట్టుదలే. నాకు తొమ్మిదేళ్లుంటాయి. దసరాపండగలకి ఆయన్ని మాయింటికి తీసుకొచ్చారు. నేను మా నేస్తాలూ అప్పుడు ఆడుకుంటున్నాం. ఏదో పేచీవచ్చి తగవు లాడుకుంటున్నాం. అప్పుడు వారు అక్కడే ఓకుర్చీలో కూచుని మా నాన్నతో మాటాడుతున్నారు.

“ఏమేపిల్లా ఇంత కోతిచేష్టల దానివి రేపు నీతో వేగడం చాలా కష్టమే అన్నారు. నేను ఊరుకోక, కోపం కొద్దీ, కోతివి నువ్వా నేనా నల్లగా పొట్టిగా పగలుచూస్తే రాత్రి కల్లోకి వస్తావు మళ్లీ” అని అప్పటికి నోటికొచ్చినంతా అనేశాను. దాంతో ఆయనకి చాలాకోపంవచ్చి, భోజనం కూడా చెయకుండా వెంటనే బస్సుకి వెళ్ళిపోయారు. మా నాన్న, అమ్మ బతిమాలినా వినలేదు. అప్పట్నించి మళ్లా ఎప్పుడూ మాయింటికి రాలేదు. రెండేళ్ల తరవాత మా నాన్నగారు పోయారు...

నాకు పధ్నాలుగో ఏడు వచ్చింది. ఆయన అంతట ఆయన కాపరానికి తీసుకెళ్ళేలా లేరని, మా అమ్మమ్మ, తాతగారు, అమ్మ నన్ను వెంటబెట్టుకుని వారింటికి తీసుకెళ్లారు. తాతగారి బలవంతంమీద ఆయన ఒప్పుకున్నారు.

“కార్యంరోజు రాత్రి నేను గదిలోకివెళ్లగా ఆయన నన్ను గసిరి,తిట్టి,తరవాత కొట్టి బయటకు గెంటేశారు. మా అమ్మమ్మ వచ్చి ఏమిటే అలా పెంకితనం చేశావు. మావయ్యకి అసలే కోపం ఎక్కువ. జాగ్రత్త అనికోప్పడి మళ్లీ గదిలోకి పంపించింది. ఆయన మాట్లాడలేదు నేను చెంగు సరుచుకుని పడుకున్నాను. ఆ రోజునించి ఆయన నా మొహం కనబడితే చాలు చిరాకుపడి లేచి వెళిపోతున్నారు. మా అమ్మమ్మ, ఆడపడుచు, తోటికోడళ్లూ అందరూ, నేనే ఆయనని ఏదో అనరాని మాటలని కోపం తెప్పించానని రోజూ తిట్టుతున్నారు. ఇరుగుపొరుగులతో నామీద లేనిపోనివి కల్పించి చెప్తున్నారు.

ఒకరోజున మాయింటిగలావిడ నన్ను చాటుకిపిలిచి, తప్పులేమేనా ఉంటే క్షమించమని నీ మొగుడి కాళ్లమీద పడు అని చెప్పింది.

నేను ఏమైనా సరేనని తెగించి, ఆ రోజురాత్రి ఆయన కాళ్లమీద పడి నా తప్పేమిటో చెప్పమన్నాను. తప్పులుంటే క్షమించమన్నాను.

ఆయన కోపంగా నన్ను తన్నేసి ఫో నేను కోతినిగా నీకుతగనుగా అన్నారు. మొదట నాకు అర్థంకాలేదు. ఆయన ఇంకా సాధిస్తూ, ఆ రోజున మీ యింటికి వచ్చినపుడు మర్యాద చేశావుగా చాలులే అన్నారు. అపుడు జ్ఞాపకం వచ్చింది.

మావయ్యా తెలియక చిన్నపుడు అన్న మాటలు నువ్విలా పట్టించుకుని శిక్షించడం న్యాయమేనా, ఇప్పడేనా క్షమించు మావయ్యా అని కాళ్లమీద పడ్డాను.

ఆయన మరింత కోపం తెచ్చుకుని, పళ్లుహూనం అయేలా కొట్టారునన్ను. అవతలికిపో అన్నారు. మళ్లీ ఈ సారి మొహం చూపిస్తే నిన్ను పొడిచి నన్ను పొడుచుకుంటాను అన్నారు. ఇదంతా చూస్తున్న మా అమ్మమ్మగాని తోటికోడలుగాని నన్ను పలకరించనైనా పలకరించలేదు. చావలేక ఇలా బతుకున్నాను.”

* * *

సీతకథ వినేసరికి కడుపు తరుక్కుపోయింది. ఏంచెప్పాలో ఎలా ఓదార్చాలో కూడా తెలియలేదు. అంతటి దుర్మార్గు లుంటారా అనిపించింది.

సీత కళ్లనీరు ఒత్తుకుని, పిన్నిగారూ ఈ మాటలు మీకడుపులో దాచుకోండి మళ్ళి ఎక్కడా అనొద్దు. అంది. నేను నెమ్మదిగా లేచి ఇంటికి వెళ్లిపోయాను మాట్లాడకుండా.

ఇది జరిగిన వారంరోజులకి, వాళ్ళింట్లోంచి ఏడుపులూ పెడబొబ్బలూ వినబడ్డాయి.

ఏమిటా అని ఆత్రుతగా చూడబోయేసరికి, సీత రాత్రి నూతిలోపడి చనిపోయిందన్నారు. ★